# సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023






## లక్ష్మీనృసింహుడి సేవలో జడ్జిలు

యైటింక్లయిన్‌కాలనీ: సీనియర్ సివిల్ జడ్జిలు అర్జున్.ఆర్.రాజ్‌కుమార్, మంథని జూనియర్ సివిల్ జడ్జి ఎం శ్రీధర్ కుటుంబసమేతంగా శనివారం నుందిళ్ల శ్రీలక్ష్మీనృసింహుడిని దర్శించుకున్నారు.



## ఇఫ్తార్ విందులో శ్రీధర్‌బాబు

మంథని: పట్టణంలోని జామ మసీద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముస్లింలకు శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
35.0/24.0

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

తల్లి ఒడిలో ఉన్నప్పటి నుంచి తనువు చాలించే వరకూ విద్య సముపార్జన చేయండి

– మహమ్మద్ ప్రవక్త

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| ఆది 6:34 | సోమ 4:37 |

## రంజాన్ వేళలు

## న్యూస్‌రీల్

### పెద్దపల్లిలో బీజేపీ జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ఎలిగేడు: రానున్న ఎన్నికల్లో పెద్దపల్లిలో బీజేపీ జెండా ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నాయకులు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు మామిడాల రమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బీజేపీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎలిగేడును మండల కేంద్రంగా చేయడం తోపాటు బ్యాంకును కూడా తీసుకొచ్చానని గుర్తు చేశారు. ప్రతి గ్రామానికీ ప్రధానమంత్రి సడక్‌యోజన కింద బీటీ రోడ్లు, సీసీరోడ్లు వేయించామన్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే మండలానికి కనీసం పోలీస్ స్టేషన్ తేవడం లేదన్నారు. జిల్లా నాయకులు గర్రెపల్లి నారాయణస్వామి, గోపు సురేందర్‌రెడ్డి, తిరుపతి, నరేశ్ రావు, మడ్లపల్లి నారాయణ, మనోహర్, జనార్దన్, గంగయ్య, మల్లారెడ్డి, పరుశరాములు పాల్గొన్నారు.

### సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆధునీకరణ

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రి ఆధునీకరణకు సంస్థ రూ.3కోట్లు కేటాయించింది. వీటితో మోకాలి చిప్ప ఆపరేషన్లు చేయనున్నారు. బ్యాక్టరీయాను గుర్తించే మైక్రో బయాలజీ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుకానుంది. అలాగే ప్రసవం కోసం ప్రత్యేక మెటర్నిటీ భవనం, చైల్డ్ వెల్ఫేర్ వార్డు ఏర్పాటు కానుంది. నూతన భవన నిర్మాణంతోపాటు ప్రత్యేక వార్డులను కూడా నెలకొల్పనున్నారు. ఇవి అందుబాటులోకొస్తే రామగుండం, బెల్లంపల్లి రీజియన్లకు చెందిన సుమారు 20వేల కార్మిక కుటుంబాలకు లబ్ధి కలుగుతుంది.



ఈ యువకుడు ఈద అశోక్. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం హరిపురం స్వగ్రామం. అమ్మానాన్న స్వరూప– మల్లయ్య. అశోక్ బీకాం, ఎంబీఏ పూర్తిచేశాడు. ఎక్కడా ఉద్యోగ అవకాశం రాకపోవడంతో గ్రామంలోనే అమ్మానాన్నకు తోడుగా వ్యవసాయ పనులు చేశాడు. వివాహమై కూతురు పుట్టింది. కుటుంబ పోషణకు గ్రామంలోనే మిషన్ భగీరథలో పనిలో చేరాడు. రూ.13వేల జీతం ఇచ్చేవారు. అవీ ఎప్పుడో వచ్చేవి. కుటుంబ పోషణ కష్టమైంది. ఉద్యోగాల కోసం కంపెనీల వెంట తిరగడం కన్నా రెక్కలకష్టాన్ని నమ్ముకుందామని అనుకున్నాడు. రెండేళ్లక్రితం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో హమాలీగా చేరాడు. వచ్చే ఆదాయంతో కరీంనగర్‌లో అద్దెకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ‘ఈ రోజుల్లో ఎంత చదివామన్నది ముఖ్యం కాదు. ఏం పనిచేశామన్నది ముఖ్యం. ఉద్యోగమే జీవితం కాదు. కష్టపడితే ఫలితం అదే ఉంటుంది’ అని అశోక్ చెబుతున్నాడు.



ఈయన చిలుకూరి తిరుపతి. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల పరిధిలోని యాదవులపల్లె. అమ్మానాన్న మల్లయ్య– ఎల్లవ్వ. ఉన్న ఎకరం వ్యవసాయభూమిని సాగు చేస్తుంటారు. తిరుపతి 2018లో ఎంబీఏ పూర్తి చేశాడు. తరువాత పలు ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేశాడు. ప్రక్రియ ఆలస్యమవడం, తదితర కారణాలతో ఆ ఆలోచన పక్కనపెట్టాడు. కరీంనగర్‌లోని ట్రాన్స్‌పోర్టులో చేరాడు. ఇంతలో వివాహమైంది. కూతురు పుట్టింది. కుటుంబ పోషణకు వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో ఏడాదిక్రితం రైల్వేలో హమాలీగా చేరాడు. ‘హమాలీగా నాకు బస్తాలు మోయడం కొత్త. అయినా ఇష్టంగా మోస్తున్నా. అవకాశాల కోసం ఎదురు చూడడం కన్నా.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితంలో సంతోషంగా బతుకుతాం’ అంటూ చెప్పాడు తిరుపతి.

సండే స్పెషల్

# గ్రాడ్యుయేట్ హమాలీలు





- హమాలీగా ఆసక్తి చూపుతున్న ఉమ్మడి జిల్లా యువత
- ఉద్యోగాలకోసం ఎదురుచూడకుండా స్వయంకృషి వైపు అడుగులు
- సొంతపనిలో సంతోషం ఉందంటున్న ‘లోకల్ బాహుబలి’లు

రక్తాన్ని స్వేదంగా చిందిస్తే కానీ వారి కుటుంబాలకు బుక్కెడు బువ్వ దొరకదు. వందల బస్తాల బరువు మోస్తే కానీ రోజు గడవదు. పొద్దున్నే లేవడం సద్దన్నం తినడం.. ఓ చేతిలో తువాల.. మరోచేతిలో టిఫిన్‌బాక్స్‌తో బయల్దేరి రావడం.. పొద్దంతా ఒళ్లువంచి పనిచేయడం వీరి నిత్యకృత్యం. చేతిలో డిగ్రీ, పీజీ పట్టాలున్నా.. కార్పొరేట్ కంపెనీల చుట్టూ తిరగకుండా.. సర్కారు కొలువే కావాలని ఎదురుచూడకుండా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. శ్రమను ఆయుధంగా మలుచుకుని జీవితంలో సక్సెస్ అవుతున్నారు రైల్వే హమాలీలు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రైల్వేస్టేషన్లలో పనిచేసే హమాలీ కార్మికుల్లో గ్రాడ్యుయేట్లు.. పోస్టు గ్రాడ్యుయేట్లు.. వారి శ్రమైక జీవనంపై సండే స్పెషల్..

– సాక్షి, కరీంనగర్ డెస్క్

### ఎక్కువగా యువతే..

హమాలీ పని అంటే రోజంతా బస్తాలు మోయాలి. పొద్దంతా కష్టపడితే.. రాత్రంతా ఒళ్లునొప్పులతో బాధపడుతుంటారు చాలామంది. కొన్నాళ్ల క్రితం 30ఏళ్ల పైబడిన వారే హమాలీ కార్మికులుగా పనిచేసేవాళ్లు. ఏదో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పనికి వచ్చామని చెప్పుకొచ్చేవారు. ఇప్పుడు కాలం మారింది. ఏసీల్లో కూర్చుని కార్పొరేట్ ఉద్యోగం చేయాలనే ఆలోచన నుంచి పనిఏదైనా సంపాదన ముఖ్యం అనే ఆలోచన యువతలో పెరుగుతోంది. రైల్వేశాఖలో పనిచేసే హమాలీ కార్మికుల్లో ఎక్కువగా యువతే కనిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, కరీంనగర్, జగిత్యాల, తదితర ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్లలో గూడ్స్‌వ్యాగన్ల నుంచి సరుకులు ఎగుమతి, దిగుమతి చేసే హమాలీల్లో 70శాతం మంది యువతే ఉంటున్నారు. ఇందులోనూ సగంమంది వరకు గ్రాడ్యుయేట్లు, పోస్టు గాడ్యుయేట్లు పనిచేస్తున్నారు.

### కరీంనగర్‌లో అధికంగా..

కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఉన్న రైల్వేస్టేషన్‌లోని హమాలీల్లో ఎక్కువగా యువతే పనిచేస్తున్నారు. రైల్వేస్టేషన్ పరిధిలో 226 మంది వరకు హమాలీలు ఉండగా.. ఎనిమిది బ్యాచ్‌ల చొప్పున పనిచేస్తున్నారు. ఇందులో 150 మంది వరకు యువతే ఉన్నారు. ఇందులోనూ 60మంది వరకు డిగ్రీలు, పీజీలు చేసినవారే. పెద్దపల్లిలో 100 మంది హమాలీల్లో 30మంది, సుల్తానాబాద్‌లో 50మందిలో 15, జగిత్యాలలో 60మందిలో 10మంది, రామగుండంలో 50మంది వరకు హమాలీలు పట్టభద్రులే. వీరిలోనూ 22 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్నవారే అధికంగా ఉన్నారు. డిగ్రీలు, పీజీలు చేసిన తరువాత సమయం వృథా చేయడం, ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరగడం, ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడడం కన్నా కష్టమైనా ఇష్టంగా పనిచేస్తున్నామని, సొంతంగా పనిచేయడంలో ఆత్మసంతృప్తి, ఆరోగ్యంతో పాటు ఆనందం ఉందని పలువురు యువ బాహుబలిలు చెబుతున్నారు.

### ఏడాదిలో తొమ్మిది నెలలు..

రైల్వేస్టేషన్లలో పనిచేసే హమాలీలు ఏడాదిలో దాదాపు తొమ్మిది నెలల పాటు విరామం లేకుండా కష్టపడుతుంటారు. పొద్దున్నే ఎనిమిది గంటల వరకు స్టేషన్‌కు చేరుకోవాలి. అక్కడ హాజరు పట్టికలో పేర్ల నమోదు తరువాత సరుకు ఎగుమతి, దిగుమతి చేస్తుంటారు. బియ్యం, ఎరువులు, గ్రానైట్, సిమెంట్, తదతర సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటారు. బయట ఉద్యోగాల కన్నా.. హమాలీ పని చేయడం ద్వారా వచ్చే ఆదాయంలో కుటుంబాన్ని సంతోషంగా పోషించుకుంటున్నామని పలువురు యువ గ్రాడ్యుయేట్ హమాలీలు పేర్కొంటున్నారు.

### ప్రభుత్వ కొలువుకూ ప్రయత్నిస్తున్నా



మాది ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లి. అమ్మానాన్న కొమురయ్య– లక్ష్మి. చెల్లి, తమ్ముడు ఉన్నారు. మాకున్న నాలుగు ఎకరాల భూమిని నాన్న సాగు చేస్తుంటాడు. 2014లో బీకాం కంప్యూటర్స్ పూర్తయ్యింది. ఎంబీఏ మధ్యలో ఆపివేశా. కరీంనగర్‌లో ఉంటూ కానిస్టేబుల్ కోచింగ్‌కు వెళ్లాను. రాత పరీక్షలో 1.5 మార్కులతో ఉద్యోగాన్ని మిస్సయ్యాను. ఇంట్లో ఖాళీగా ఉంటున్నానని తెలిసినవాళ్లు కరీంనగర్‌లోని రైల్వేలో హమాలీగా పని ఇప్పించారు. కొత్తలో కాస్త కష్టమనిపించింది. డిగ్రీ చదివిన నేను హమాలీ చేయడం ఏంటని ఇబ్బంది పడ్డా. తరువాత పనికాదు ముఖ్యం.. పట్టుదల అనిపించింది. హమాలీ పని అలవాటైంది. మూడేళ్లుగా ఇక్కడే చేస్తున్నా. ఇటీవలే వివామైంది. ఈ పని చేసుకుంటూనే మళ్లీ పోలీసు ఉద్యోగానికి సన్నద్ధం అవుతున్నా. ఈవెంట్స్ సాధించాను. పొద్దంతా హమాలీ.. ఇంటికెళ్లాక పుస్తకాలతో కుస్తీ పడుతున్నా.

– మాదరవేని అశోక్, రైల్వే హమాలీ, ర్యాకల్‌దేవ్‌పల్లి

### నాన్న పని నేను చేస్తున్నా



మాది రామగుడు మండలం ఒన్నారం. అమ్మానాన్న సత్తవ్వ– కనుకయ్య. నేను బీఎస్సీ(స్టాటిస్టిక్స్) 2020లో పూర్తిచేశా. తరువాత మాకు ఉన్న మూడు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ అమ్మానాన్నకు తోడుగా ఉన్నా. పలు ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నం చేశా.. రాలేదు. సమయం వృథా చేయవద్దు అనుకున్నా. నాన్న కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో హమాలీ పని చేసేవాడు. ఇప్పుడు నాన్నకు చేతనైతలేదు. ఇక ఆయన బాధ్యత నేను తీసుకున్నా. ఏడాదిన్నరగా రైల్వేలో హమాలీగా పనిచేస్తున్నా. కొత్తలో కష్టమనిపించింది. ఇప్పుడు అలవాటైంది.

– సతీశ్, రైల్వే హమాలీ, ఒన్నారం

### దుబాయ్ పోయి వచ్చిన



మాది మానకొండూర్ మండలం ఖాదర్‌గూడెం. అమ్మానాన్న అరుణ– రమేశ్. మాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. నేను బీకాం పూర్తిచేశా. డిగ్రీ అయిన వెంటనే దుబాయ్ వెళ్లాను. అక్కడ చెఫ్‌గా పనిచేశాను. కరోనా టైంలో అక్కడ ఉండలేని పరిస్థితి. ఇంటికొచ్చాక ప్రయివేటుగా ఉద్యోగం దొరకని దుస్థితి. అప్పటికే మా నాన్న రైల్వేలో హమాలీగా పనిచేస్తున్నారు. 40ఏళ్లుగా ఒక్కడే బస్తాలు మోస్తూ మమ్మల్ని పోషించారు. ఇక ఆయన్ను కష్టపెట్టవద్దు అనుకున్నా. ఆయన బాధ్యతలు నేను తీసుకున్నా. ఏడాదిన్నర హమాలీగా పని చేస్తున్నా. కొత్తలో ఇబ్బందిగా ఉన్నా.. తోటి కార్మికులు తోడుగా నిలిచారు. ఇటీవలే వివాహమైంది. కూలీగా చేస్తున్నా.. కుటుంబాన్ని సంతోషంగా ఉంచుతున్నా.

– జంగ శ్రీకాంత్, రైల్వే హమాలీ, ఖాదర్‌గూడెం

# మన సింగరేణిని మనమే కాపాడుకోవాలి

- బండి సంజయ్ ఓ పిచ్చి నాయకుడు
- బీజేపీ నాయకులు టెర్రరిస్టులకు తీసిపోరు
- ఎనిమిదేళ్లు కాని లీకేజీలు ఇప్పుడెందుకు అవుతున్నాయ్..?
- సింగరేణి ప్రైవేటీకరణపై గోదావరిఖనిలో బీఆర్ఎస్ మహాధర్నా
- కేంద్రం తీరుపై విరుకుపడిన మంత్రి కొప్పుల ఈశ్వర్



మహాధర్నాలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, చిత్రంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు

సాక్షి, పెద్దపల్లి: సింగరేణిని కాపాడుకోవాలంటే మతతత్వ, కులతత్వ బీజేపీపై ఉద్యమమేమార్గంగా పోరాటం చేయాలని రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గోదావరిఖని చౌరస్తాలో సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ‘బీజేపీ హటావో. సింగరేణి బచావో’ పేరుతో నిర్వహించిన మహాధర్నాలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోలిండియాలో లేని ప్రయోజనాలు సింగరేణిలో ఉన్నాయన్నారు. సంస్థ ప్రైవేటీకరిస్తే సంస్థ లాభాల్లో 30 శాతం వాటా, ఉచిత విద్యుత్, వారసత్వ ఉద్యోగాలు కార్మికులకు అందుబాటులో ఉండబోవని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుంటే కేంద్రం మాత్రం 134 ఏళ్ల చరిత్ర ఉన్న సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పన్నుతోందని, తద్వారా 45లక్షల సింగరేణి కార్మికులు అన్యాయం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రైవేటీకరణ ద్వారా ప్రధాని మోదీ తన అనుచరులకు లాభం చేస్తారని విమర్శించారు. సింగరేణి కార్మికులు తమ లాభాలు, హక్కులను పూర్తిగా కోల్పోతారని పేర్కొన్నారు. ఎన్టీపీసీలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి మన బొగ్గును వాడుకుంటూ సింగరేణి కార్మికుల కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని, ప్రైవేట్‌పరం చేస్తే బొగ్గు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంటుదని తెలిపారు. బండి సంజయ్ అనే పిచ్చి నాయకుడు మత విద్వేషాలను రెచ్చగొడుతూ అలజడి రేపేందుకు కుట్రకు దిగుతున్నారని విమర్శించారు. రక్తపాతం, హింసావాదం సృష్టించడమే వారి విధానమైతే వీరికి టెర్రరిస్టులకు పెద్దగా తేడా ఏమీ లేదన్నారు. ఎనిమిదేళ్లలో జరగని పేపర్ లీకేజీలు ఇప్పుడే ఎందుకు జరుగుతున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలని, దీని వెనుక బీజేపీ కుట్ర దాగి ఉందన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. రాజ్యాధికారం కావాలంటే ప్రజలను ఒప్పించి మెప్పించి బీఆర్ఎస్ కంటే ఎక్కువ పనిచేస్తామని చెప్పాలి తప్పా ఇలాంటి కుట్రలు, కుతంత్రాలతో అధికారంలోకి రావాలనుకోవడం సిగ్గు చేటని విమర్శించారు. బీజేపీలో ఉన్నోళ్లే దేశభక్తులైనట్లు.. ఇన్నాళ్లు అసలు ఈ దేశంలో దేశభక్తులే లేనట్లు మాట్లాడటం వాళ్ల కుల పిచ్చి, మత పిచ్చికి నిదర్శనమన్నారు.

### మన భూమి.. మన బొగ్గు.. మనకే హక్కు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. కేంద్రం సింగరేణి బొగ్గు గనులను బ్లాక్‌ల పేరుతో ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర పన్నుతోందని పేర్కొన్నారు. ‘ఇది మనభూమి.. మన బొగ్గు.. బొగ్గుపై మనకే హక్కుంటుంది. సీఎం కేసీఆర్, కేటీఆర్, కవిత ఆధ్వర్యంలో పోరాడి మన బొగ్గును మనమే సాధించుకుందాం.. బీజేపీని ఇదే బొగ్గులో కాల్చి బూడిద చేద్దాం. సింగరేణి కార్మికులంతా బీజేపీ విధానాలపై కదం తొక్కి మరో ఉద్యమానికి సిద్ధంకావాలి..’ అని పిలుపునిచ్చారు. నల్లనేలపై నిప్పు కణకలా మారి బీజేపీని భూస్థాపితం చేద్దామన్నారు. అప్పటి వరకూ ఆగేది లేదని, ఇది ఆరంభం మాత్రమేనని వివరించారు. బొగ్గు బ్లాకుల్లో బొగ్గును వెలికి తీసేందుకు సింగరేణికే అవకాశం ఇవ్వాలన్నారు. ప్రధాన మంత్రి మోదీ సింగరేణి బొగ్గు బ్లాకులను సింగరేణికే అప్పగిస్తామని మాటివ్వాలన్నారు.



సభకు హాజరైన జనం

### తెగించి కొట్లాడుడే..



బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించే వరకూ తెగించి కొట్లాడుడే. వరుస లాభాల్లో నడుస్తున్న సింగరేణిని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం కుట్రపన్నుతోంది. ఈ విషయంలో కార్మికులంతా ఉద్యమించాలి. – మిర్యాల రాజిరెడ్డి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి

### సంఘటితంగా పోరాటం



ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్న కల్పతరువు సింగరేణి తల్లి. కేంద్రం కావాలనే బొగ్గు బ్లాకులను ప్రయివేట్‌కు అప్పగించాలని చూస్తోంది. వెనక్కి తగ్గకుండా తెలంగాణకే కొంగుబంగారంలా నిలిచిన సంస్థను కాపాడుకుందాం.

– గంద్ర దామోదర్‌రావు, ఆర్జీ–1 ఉపాధ్యక్షులు

### దెబ్బతీసేందుకే..



తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దెబ్బతీసేందుకు కేంద్రం కుట్రపన్నుతోంది. సింగరేణి రూ.కోట్లు వెచ్చించి గుర్తించిన బొగ్గు బ్లాకులను ఇతర సంస్థలను కేటాయిస్తే ఊరుకోం. అన్ని యూనియన్లతో కలిసి ఉద్యమిస్తాం. – ఐలి శ్రీనివాస్, ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు

### ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలి



మాట్లాడుతున్న వీరయ్య

జ్యోతినగర్: ఆక్రమణకు గురువుతున్న ప్రభుత్వ భూమిని పేదలకు ఇళ్లస్థలాలుగా పంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఇందిరమ్మ కాలనిలోని భూపోరాట శిబిరాన్ని శనివారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు, ఐద్వా రాష్ట్ర నాయకులు అరుణజ్యోతితో కలిసి సందర్శించారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ నేటికీ నెరవేరడం లేదన్నారు. పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే అధికారులు తొలగించడమేంటని ప్రశ్నించారు. జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, ఎం.రామాచారి, ఎ.మహేశ్వరి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రాజారెడ్డి, సీఐటీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గీట్ల ముకుంద రెడ్డి, రెండో డివిజన్ కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జార్జ్‌రెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రమేశ్

రామగిరి(మంథని): కామ్రేడ్ జార్జిరెడ్డి 51వ వర్ధంతి వేడుకలను విజవంతం చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ)ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ కోరారు. శనివారం సెంటినరీకాలనీలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జార్జ్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 14 నుంచి 18 వరకు జిల్లా వ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దేశంలో హిందూ మతం పేరుతో బీజేపీ ప్రభుత్వం అనేక దాడులు చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పరీక్షల విషయంలో రోజురోజుకు లీకుల డ్రామాలు ఆడుతున్నదని దుయ్యబట్టారు. తక్షణమే లీకుల బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నక్క పవన్, గణేష్, మల్లికార్జున్, అజయ్, డేవిడ్, సంజీవ్, రాకేష్ పాల్గొన్నారు.

### ఆర్ఎఫ్‌సీఎల్‌లో కనిపించని కార్మిక చట్టాలు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: ఆర్ఎఫ్‌సీఎల్‌లో కార్మిక చట్టాలు అమలుకావడం లేదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.క్రిష్ణ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆర్ఎఫ్‌సీఎల్ బ్రాంచ్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. ముందుగా ముంజ హరీశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో సౌకర్యాలు, సంక్షేమం, పనిభద్రత ఉంటుందని నమ్మించి దళారులు, కాంట్రాక్టర్లు రూ.లక్షలు దండుకున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక ఉద్యమాల్లో సంఘటితంగా ముందుకు సాగాలన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. యూనియన్ జెండా ఆవిష్కరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాషవేని రమేష్, ప్రధాన కార్యదర్శి తిప్పని రాంకీ, ఉపాధ్యక్షుడు ఐద శ్రవణ్, సహాయ కార్యదర్శి అనంతుల రవీందర్, రమేశ్, కోశాధికారి జక్కుల తిరుపతి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు అర్కుటి కుమార్, మానుక మధూకర్ ఎన్నికయ్యారు.

### స్టీల్ షాప్‌లో చోరీ

గోదావరిఖని: స్థానిక లక్ష్మీనగర్‌లోని ఓ స్టీల్ షాప్‌లో దొంగలు పడి నగదు ఎత్తుకెళ్లారు. షాపు యజమాని శుక్రవారం రాత్రి కౌంటర్‌లో రూ.85వేలు ఉంచి షెట్టర్‌కు తాళం వేసి వెళ్లాడు. శనివారం ఉదయం షాప్ షెట్టర్ తీసి కౌంటర్ చూడగా.. అందులో నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈమేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు పిర్యాదు చేశాడు. షాప్ యజమాని అర్జున్‌సింగ్ ఫిర్యాదు మేరకు ఎస్సై కమలాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ మొత్తం సీసీ కెమెరాలో రికార్డయినట్లు తెలుస్తోంది.

# రాష్ట్రపతి భవన్‌కు మన విద్యార్థులు

- ఈనెల 10 నుంచి 13 వరకు ప్రదర్శనలు
- జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థినుల ఎంపిక

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యాశాఖలు పలు రకాల పోటీలను నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్–ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయస్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్–2022 పోటీల్లో దేశవ్యాప్తంగా 60 మంది విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనలు ప్రదర్శించారు. వీరు ఈనెల 10 నుంచి 13 వరకు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశం కానున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ నుంచి పెద్దపల్లి జిల్లాకు చెందిన డి.హర్షిత, పూజాశ్రీ ఎంపికయ్యారు.

**ఢిల్లీకి బయలుదేరిన విద్యార్థినులు**

9వ జాతీయ ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా పేరును జాతీయస్థాయిలో ఇనుమడింపజేసిన ఇద్దరు విద్యార్థినులు శనివారం న్యూఢిల్లీకి బయలుదేరారు. రామగిరి మండలం చందనాపూర్ విద్యార్థిని దాసరి హర్షిత, సుల్తానాబాద్ మండలకేంద్రంలోని అల్ఫోర్స్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ముస్త్యాల పూజశ్రీ ఈనెల 10 నుంచి 13 వరకు రాష్ట్రపతి భవన్‌లో ఎన్ఐఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్–2023'లో పాల్గొంటారని డీఈవో మాధవి తెలిపారు.



కేంద్రమంత్రి జితేంద్రసింగ్ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థి



### మల్టీపర్పస్ హెల్మెట్

ఒక హెల్మెట్, రెండు చిన్న ఫ్యాన్లు, పొగను గుర్తించే సెన్సార్, బ్యాటరీల సాయంతో తయారు చేయడం జరిగింది. దుమ్ము, ధూళి, పొగ మన దరి చేరగానే సెన్సార్ గుర్తించి హెల్మెట్ పైన గల ఫ్యాన్లను వేగంగా తిప్పడం వల్లన దుమ్ము దూరంగా నెట్టివేయయబడుతుంది. దీంతో దుమ్ము నుంచి కాపాడుకోవచ్చు. రైతులకు, వెల్డర్లకు, కార్పెంటర్లకు, ట్రాఫిక్ పోలీసులకు ఈ హెల్మెట్ ఎంతో ఉపయోకరంగా ఉంటుంది.

– దాసరి హర్షిత, 9వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, చందనాపూర్, రామగిరి

### వాహనానికి యాక్సిల్ కెమెరా



భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల పలు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టాలు సంభవిస్తున్నాయి. ఈక్రమంలో రోడ్డు ప్రమాదాలను నివారణకు స్కూల్ బస్‌కు యాక్సిల్ సీసీ కెమెరాను అమర్చడంతో ప్రమాదాలను నివారించవచ్చని చేసిన ప్రయోగం జాతీయస్థాయికి ఎంపికైంది. రాత్రి వేళల్లో బస్సు డ్రైవర్ అప్రమత్తంగా ఉండేందుకు, బస్సు కింద ఎవరైనా ఉంటే సీటు దగ్గర ఉన్న మోబైల్ ఫోన్, స్క్రీన్‌లో స్పష్టంగా కనిపిస్తుంది.

– ఎం.పూజాశ్రీ, 9వ తరగతి, అల్ఫోర్స్ స్కూల్, సుల్తానాబాద్

### మన విద్యార్థులు అందరికీ ఆదర్శం



జిల్లాకు విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి సైన్స్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనలు తయారుచేసి పలు అవార్డులు అందుకున్నారు. ఇన్‌స్పైర్ మనక్‌లో జిల్లాకు చెంది న ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనలు తయారుచేసి జాతీయస్థాయి అవార్డులు అందుకోవడంతో పాటు రాష్ట్రపతి ముందు ప్రదర్శించేందుకు అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉంది. వారిని రాష్ట్రపతి భవన్‌కు తీసుకెళ్లడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా.

– బి.రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి

### ఆనందంగా ఉంది



ఇన్‌స్పైర్ మనక్ జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమంగా నిలిచిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శనకు ఎంపికకావడం ఆనందంగా ఉంది. జిల్లా నుంచి ఇద్దరు ఎంపిక కావడం సంతోషదాయకం. రానున్న రోజుల్లో ఈ విద్యార్థుల స్ఫూర్తితో మరికొంత మందిని తయారు చేసేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– డి.మాధవి, జిల్లా విద్యాధికారి

# భర్త ఆత్మహత్యతో భార్య మనస్తాపం

- ఫిబ్రవరిలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న భర్త
- అతడినే తలచుకుంటూ ఉరేసుకొని భార్య బలవన్మరణం
- పోతనకాలనీలో విషాదం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): గత ఫిబ్రవరిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పనాస భాస్కర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోగా, అతడి మృతి తట్టుకోలేక భార్య బలవన్మరణానికి పాల్పడింది. అన్యోన్యంగా ఉండే దంపతులు అఘాయిత్యాలకు పాల్పడడంతో పోతనకాలనీలో విషాదం నెలకొంది. దాదాపు 44 రోజుల వ్యవధిలో భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకోవడంతో డిప్లొమా చదువుతున్న కుమారుడు, బీటెక్ చేస్తున్న కుమార్తె ఒంటరయ్యారు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. పోతనకాలనీలోని 22వ బ్లాక్ 297 క్వార్టర్‌లో నివాసం ఉంటున్న పనాస భాస్కర్ ఫిబ్రవరి 23న పెద్దపల్లి రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి అతడి భార్య వాణి(39) భర్తనే తలుచుకుంటూ మదనపడింది. తాను కూడా చనిపోతానంటూ చెప్పేదని కుమారుడు అభిషేక్ పేర్కొన్నాడు. అమ్మకు తోడుగా ఉండేందుకు అమ్మమ్మ, నాన్నమ్మను వారి ఇంట్లోనే ఉంచుకుంటున్నారు. అయినా ఆమెలో ఎలాంటి మార్పు రాలేదు. తీవ్ర మనస్తాపంతో శనివారం వేకువజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై కళాధర్‌రెడ్డి తెలిపారు.



వాణి, భాస్కర్ దంపతులు(ఫైల్)

### ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం

రామగిరి(మంథని): మండలంలోని బుధవారంపేట(రామయ్యపల్లి)కు చెందిన పెంద్రు శ్రీనివాస్‌రెడ్డి(88) శనివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాలు.. శ్రీనివాస్‌రెడ్డి కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అతడి భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. స్థానికంగా ఉంటున్న కొడుకు వద్ద తింటూ ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత కుటుంబ సభ్యులు నిద్రలోకి జారుకున్నారు. వేకువజామున నిద్రలేచిన తర్వాత శ్రీనివాస్‌రెడ్డి ఇంటి నుంచి బయటకు రాలేదని గమనించిన కుటుంబ సభ్యులు తలుపులు నెట్టి చూడగా దూలానికి ఉరి వేసుకుని ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిప్రసాద్ తెలిపారు.

### తెలంగాణలో అడుగుపెట్టే హక్కు పీఎంకు లేదు

గోదావరిఖని: విభజన చట్టంలోని ఏఒక్క హామీనీ నెరవేర్చని ప్రధాని నరేంద్రమోదీకి రాష్ట్రంలో అడుగుపెట్టే నైతిక హక్కులేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేలా అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్‌కు అప్పగించారన్నారు. ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ యువతను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు వై.యాకయ్య, వెంకట్రాములు, అరుణజ్యోతి, ముకుంద రెడ్డి, వేల్పుల కుమారస్వామి, ఎ.మహేశ్వరి, టి.రాజారెడ్డి, మెండె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- పీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు



బహుమతులు అందజేస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): క్రీడకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని శాస్త్రినగర్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటమికి కారణాలను క్రీడాకారులు అన్వేషించి గెలుపు కోసం సాధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలకు సుల్తానాబాద్ పుట్టినిల్లు అని, అనేకమంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు పెట్టింది పేరని కొనియాడారు. గట్టెపల్లి జట్టు మొదటి స్థానం కైవసం చేసుకోగా రూ.20 వేలు, రన్నర్ ఆఫ్‌గా సుల్తానాబాద్ పట్టణంలోని 8వ వార్డు క్రీడాకారులు రూ.10 వేలు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు నిట్టూరు రాజు, సద్దాం, అనంతుల మనోజ్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సి.సత్యనారాయణరెడ్డి, వేముల రామ్మూర్తి, అంతటి అన్నయ్యగౌడ్, మినుపాల ప్రకాష్‌రావు, దన్నాయక్ దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# రెండు లారీల పీడీఎస్ బియ్యం రికవరీ

- ముగ్గురిపై క్రిమినల్ కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన సీఐ ఇంద్రసేనారెడ్డి

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌లోని పౌరసరఫరాల శాఖ ఎంఎల్ఎస్ గోదాంకు చేర్చకుండా అదృశ్యమైన రెండు లారీల పీడీఎస్ బియ్యాన్ని రికవరీ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. గత నెల 28న మండలంలోని సుద్దాల స్టేజ్ వన్ గోదాం నుంచి ఎంఎల్ఎస్ పాయింట్‌కు ఐదు లారీల బియ్యాన్ని పంపించగా.. ఇందులో మూడు లారీలు చేరుకున్నాయి. రెండు లారీలు అదృశ్యమయ్యాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారులు గోదాంలో తనిఖీ చేసి విషయాన్ని గుర్తించారు. డాటా ఏంట్రీ అపరేటర్ శ్రీనివాస్‌రెడ్డిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గత నెల 31న డీఎస్ఓ వెంకటేశ్ ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేస్తున్న క్రమంలో శనివారం ఎస్సారెస్పీ కెనాల్ పక్కన ఉన్న మూడు రైస్‌మిల్లుల వద్ద రెండు లారీల్లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు వెళ్లి రెండు లారీల బియ్యాన్ని మళ్లీ ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంకు చేర్చుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. గోదాం ఇన్‌చార్జి వెంకట్‌రాజయ్య, డాటా ఏంట్రీ అపరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, డీలర్ కొమ్ము ఓదెలు నిందితులుగా తేలడంతో వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, రెండు లారీలను సీజ్ చేశామని పేర్కొన్నారు.



అరెస్టు చూపిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

**766 క్వింటాళ్లకు 492 క్వింటాళ్ల రికవరీ**

మాయమైన రెండు లారీల బియ్యంపై ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, విజిలెన్స్ అధికారులు గోదాంలో తనిఖీలు నిర్వహించగా 766 క్వింటాళ్ల బియ్యం మాయమైనట్లు అధికారుల లెక్కల్లో తేలాయి. ఇందులో 492 క్వింటాళ్ల బియ్యం మాత్రమే రికవరీ అయ్యాయి. అధికారులు మరింత లోతుగా విచారణ చేపడితే మిగిలిన బియ్యం కూడా రికవరీ అయ్యే అవకశాలున్నాయని స్థానికంగా వినిపిస్తోంది.

## బొగ్గుబాయి వార్తలు

# మహాధర్నా కాదు.. బోగస్ ధర్నా



మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

- ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): బీఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ చేపట్టిన మహాధర్నా.. బోగస్ ధర్నా అని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ అన్నారు. శనివారం యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం దానికి మద్దతు తెలుపుతూ మహాధర్నా పేరుతో మరోసారి కార్మికులను మోసం చేస్తుందని ఆరోపించారు. 2015లో ఎంఎండీఆర్ కింద కేంద్ర ప్రభుత్వం చట్టాలను చేసినప్పుడు బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు ఇచ్చి ప్రస్తుతం బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకమని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మూడు బొగ్గు గనులను తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై ప్రైవేటీకరణ చేశారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మోదీ రాష్టానికి దాదాపు 10సార్లు వచ్చినా ఎందుకు ప్రశ్నించలేదని, ప్రస్తుతం ప్రజలను మభ్యపెడుతూ వారి ఉనికిని కాపాడుకోవడానికి ధర్నా పేరుతో కార్మికులను మోసం చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌తో పాటు టీబీజీకేఎస్ నాయకులకు ప్రజలు, సింగరేణి కార్మికులు తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ అక్బర్ అలీ, ధర్మపురి, గుమ్మడి కుమారస్వామి, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాస్, కృష్ణ, మనోహర్, మార్కండేయ, అలావుద్దీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు బ్లాక్‌ల వేలం విరమించుకోవాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: బొగ్గు బ్లాకుల వేలాన్ని కేంద్రం వెంటనే విరమించుకోవాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం జీడీకే–2ఏగనిపై ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిని పూర్తిగా ప్రైవేటీకరించి కేంద్రం చేతులు దులుపుకోవాలని చూస్తోందన్నారు. కార్మికులు, తెలంగాణ ప్రజలు సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులు కేటాయించాలని కోరినా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటివరకు ఎవరూ రాక పోవడంతో మళ్లీ వేలం కోసం టెండర్ల గడువు పెంచారన్నారు. దీనికి మార్చి 29 నుంచి మే 30 వరకు గడువు విధించిందన్నారు. సమావేశంలో నాయకులు ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, ఎస్.వెంకట్‌రెడ్డి, గండి ప్రసాద్, మిట్ట శంకర్, పర్లపెల్లి రామస్వామి, ఎంఏగౌస్, శనగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఏరియా ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి 8కిలోల కణతి తొలగించారు. కొంతకాలంగా కడుపు నొప్పి, ఆయాసంతో బాధపడుతున్న సింగరేణి కార్మికుడు కరుణాకర్‌రెడ్డి తల్లి సరోజన ఈనెల 3న ఏరియా ఆసుపత్రిలో చేరింది. గైనకాలజిస్ట్ ఇందిర పరీక్షించి కణతి ఉందని గుర్తించారు. గుండె సంబంధమైన ఇబ్బందులు ఉన్నా.. మత్తు డాక్టర్ మద్దిలేటి, గైనకాలజిస్ట్ బృందంతో ఆపరేషన్ చేసి తొలగించారు. వైద్య బృందాన్ని డీవైసీఎంఓ డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్ అభినందించారు.



తొలగించిన 8కిలోల కణితి



18 కేంద్రాలు..

పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

# 12,784 మంది హాజరు

- ప్రశాంతంగా ముగిసిన ఎస్ఐ మెయిన్స్
- కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు
- పరీక్ష సమయానికి ముందే కేంద్రాల్లోకి అనుమతి
- సెంటర్లను పరిశీలించిన సీపీ సుబ్బారాయుడు



తండ్రికి బ్యాగ్ అప్పగిస్తున్న అభ్యర్థిని

కరీంనగర్‌క్రైం: పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్ఐ(సివిల్/ఎఆర్/టీఎస్ఎస్పీ/ఎస్పీఎఫ్/ఎస్ఆర్ సీపీఎల్/ఫైర్) అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రాత పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఎస్ఐ అభ్యర్థుల రాత పరీక్ష కోసం కరీంనగర్, తిమ్మాపూర్, నుస్తులాపూర్‌లో 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పరీక్ష కొనసాగింది. సీపీ ఎల్.సుబ్బారాయుడు బందోబస్తు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని లాడ్జీలను తనిఖీ చేశారు. అభ్యర్థుల వేలిముద్రలను బయోమెట్రిక్ విధానం ద్వారా పరిశీలించారు. పరీక్ష కేంద్రాల ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లను పరీక్ష మూసి వేయించారు. కాగా.. శనివారం జరిగిన పరీక్షకు 12,784 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 94.84 హాజరు శాతం నమోదైంది.

### పూర్వ వైభవం తీసుకురావాలి

సుల్తానాబాద్: టీడీపీకి పూర్వవైభవం తీసుకురావాల్సిన బాధ్యత పార్టీ నాయకులదేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. శనివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో పెద్దపల్లి పార్లమెంట్ పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ జెండాలను ఆవిష్కరించాలని సూచించారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో టీడీపీ నాయకులు గద్దల నారాయణ, ఠాకూర్ మణిరామ్ సింగ్, ఏడుకొండలు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.